# వీళ్ళు భారతీయ తాలిబాన్లు
# దేశమంతా అల్లకల్లోలం సృష్టిస్తున్నారు

హిట్లర్ జర్మన్ పార్లమెంట్ భవనం (రీచ్‌స్టాగ్)ను తగలబెట్టి ఆ నేరం కమ్యూనిస్టులపై మోపి జైళ్లో పెట్టాడు. విచారణలో హిట్లరే రీచ్‌స్టాగ్‌ను తగలబెట్టాడని కమ్యూనిస్టులు నిర్దోషులని తేలింది. ఆ హిట్లర్ వారసులుగా కాషాయదళమే ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు)లో దేశవ్యతిరేక నినాదాలు చేసింది. ఆ నేరాన్ని జెఎన్‌యు విద్యార్థి సంఘం నాయకత్వంపై నెట్టి దేశద్రోహ నేరం మోపి జైళ్ళో పెట్టారు. ఒక అబద్ధం వందసార్లు చెబితే ప్రజలు నిజమని నమ్ముతారని హిట్లర్ మంత్రివర్గంలో ప్రసారశాఖా మంత్రి గోబెల్స్ సిద్ధాంతం. కాషాయదళం ఆ సిద్ధాంతాన్ని ఇక్కడ అమలుచేస్తున్నది.

- **JNU** లో దేశ వ్యతిరేక నినాదాలు చేసింది - ఎబివిపి. తీరా దేశద్రోహులను శిక్షించాలని గొంతు చించుకుందీ ఎబివిపి, సంఘీయులే.
- కరుడుగట్టిన ఉగ్రవాది హఫీజ్ సయ్యద్ పేరున అగర్వాల్ అనే వ్యక్తి సృష్టించిన దొంగ ట్విట్టర్‌ను దేశ హోంమంత్రి, ఢిల్లీ పోలీసులు రీట్విట్ చేసారు. తప్పుడు ట్విట్ చేసిన అగర్వాల్‌ను ఇంతవరకు అరెస్ట్ చేయలేదు.
- తీవ్రవాదులకు మద్దతుగా నిలుస్తున్న జెఎన్‌యు విద్యార్థులకు తమ సంస్థల్లో ఉద్యోగాలివ్వబోమని ట్విట్టర్‌లో రతన్‌టాటా ప్రకటించి దేశభక్తిని చాటుకున్నాడని ఫేస్‌బుక్, ట్వీట్‌లతో సంఘపరివార్ ప్రచారం చేసింది. రతన్‌టాటా అలాంటి ప్రకటనేదీ చేయలేదని టాటా గ్రూప్ ట్వీట్ చేసి వీళ్ళ మోసాన్ని రట్టు చేసింది.
- గత సెప్టెంబర్ 28న ఉత్తరప్రదేశ్ దాద్రిలో బీఫ్ తిన్నాడని మహమ్మద్ అఖలాక్‌ను కొట్టి చంపింది విశ్వహిందూ పరిషత్ సంఘపరివారమే. అన్ని దర్యాప్తుల్లోనూ, ఫోర్సెనిక్ పరీక్షల్లోనూ అతను మటన్ తిన్నాడని తేలింది.

ఆఫ్ఘనిస్థాన్‌లో ఇస్లాం మతరాజ్యం స్థాపించడం తాలిబాన్ ఉగ్రవాదుల లక్ష్యం. సిరియా, ఇరాక్ తదితర దేశాల్లో ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు చేయడం ఐసిస్, ఆల్‌ఖైదా ఉగ్రవాద సంస్థల ధ్యేయం. భారతదేశంలో హిందూమత రాజ్యం ఏర్పాటుచేయడమే ఆర్ఎస్ఎస్ దాని అనుబంద సంస్థలు ఎబివిపి, విశ్వహిందూపరిషత్, భజరంగదళ్, రామసేన, హిందూసేన, బిజెపిల ఉద్దేశ్యం.

బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి వీళ్లు హేతువాద భావాలు వ్యక్తం చేసినందుకు దభోల్కర్, పన్సారే, కల్బుర్గిలను హత్యచేసారు. స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నందున విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులపైనా, మేధావులపైన దాడులు చేస్తున్నారు. లౌకికభావనలు, భావప్రకటన స్వేచ్ఛను అణచివేసి తాలిబన్ల దారిలో నడుస్తున్నారు. మొన్న మద్రాస్ ఐఐటి, నిన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, నేడు జెఎన్‌యులపై వీళ్లు చేస్తున్న దాడులు అందులో భాగమే.

నాడు జర్మనీలో హిట్లర్ మొదట యూదుల్ని ఊచకోత కోసాడు. తరువాత క్రిస్టియన్ల భరతం పట్టాడు. అనంతరం కమ్యూనిస్టులను వేటాడాడు. చివరికి రెండవ ప్రపంచయుద్ధం తెచ్చి మూడు కోట్ల మంది చావుకు, ఆరుకోట్ల మంది క్షతగాత్రులను చేసి చివరికి రష్యా రెడ్‌ఆర్మీ దెబ్బకు ఆత్మహత్య చేసుకొన్నాడు. జాతీయ దురహంకారం, మతోన్మాదం, ప్రపంచదోపిడీ శక్తులు కలిస్తే ఇటువంటి భయంకర పరిణామాలే జరుగుతాయి. నేడు బిజెపి, కాషాయమూకలు ప్రపంచ దోపిడీ శక్తులతో కలిసి అదే దారిలో పయనిస్తున్నది.

స్వాతంత్ర్యం కోసం కడకంటా పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీని హత్యచేసిన గాడ్సే వారసులు వీళ్ళు. దేశ స్వాతంత్ర్యంకై ఉరికంభం ఎక్కిన భగత్‌సింగ్ వారసులను దేశద్రోహులుగా వీళ్ళు చిత్రిస్తున్నారు. లౌకిక వాదులు, ప్రజాతంత్రవాదులు, దేశభక్తులంతా ఐక్యమై కాషాయమూకల సిద్ధాంతాన్ని, హంతక చర్యలను తిప్పికొట్టాలి. లేకుంటే దేశమంతా అల్లకల్లోలమే.

- సిపిఎం